
నైట్ డ్యూటీ సిబ్బందికి భద్రత అవసరం



కోల్‌కతాలో పీజీ వైద్య విద్యార్థినిని కిరాతకంగా హతమార్చిన సంఘటన వైద్య వృత్తిలో ఉన్న ప్రతి ఒక్కరినీ కలచివేసింది. ఇలాంటి ఘటనలు పునరావృతమైతే రోగులకు స్వేచ్ఛగా సేవలు అందించలేని పరిస్థితి ఏర్పడుతుంది. వైద్యులకు భద్రత కల్పించాలి. ముఖ్యంగా నైట్ డ్యూటీ నిర్వహించే సిబ్బందికి భద్రత ఎంతో అవసరం. ఆసుపత్రుల్లో దాడులకు పాల్పడే ఉన్మాదులపై కఠిన చర్యలు ఉండేలా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కఠిన చట్టాలు రూపొందించి అమలు చేయాలి. –డాక్టర్ వి.నరేంద్ర, గూడూరు సీహెచ్‌సీ

సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలి



విధి నిర్వహణలో ఉండే వైద్యులు, వైద్య సిబ్బందికి పూర్తిస్థాయిలో భద్రత కల్పించేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి. చికిత్స అందించే క్రమంలో ఒక్కోసారి రోగితో పాటుగా వచ్చే సహాయకుల నుంచి ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుంటుంది. అన్ని ఆసుపత్రులలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసి రెగ్యులర్‌గా మానిటరింగ్ చేస్తుండాలి. తద్వారా వైద్యులు, వైద్య సిబ్బందిపై దాడులు కొంతమేరకు అరికట్టవచ్చు. ఆసుపత్రుల్లో సెక్యూరిటీ గార్డులను కూడా నియమించాలి. –డాక్టర్ ఇనాయత్ అలీ, గూడూరు సీహెచ్‌సీ

విష జ్వరాలు విజృంభిస్తున్నాయి

- వైద్య సిబ్బంది అప్రమత్తంగా ఉండాలి
- మండల పరిషత్ సమావేశంలో ఎంపీపీ వాణి



మండల పరిషత్ సర్వసభ్య సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ వాణి

పెడన: మండల వ్యాప్తంగా విష జ్వరాలు విజృంభిస్తున్నాయని, వైద్య సిబ్బంది అప్రమత్తంగా వ్యవహరిస్తూ విషజ్వరాలు ప్రబలకుండా పటిష్ట చర్యలు చేపట్టాలని ఎంపీపీ రాజులపాటి వాణి అన్నారు. ఎంపీపీ అధ్యక్షతన మంగళవారం మండల పరిషత్ సర్వసభ్య సమావేశం ఎంపీడీవో కార్యాలయంలోని సమావేశ మందిరంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ పెడన, చేవెంద్ర ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల పరిధిలో విషజ్వరాలు బాగా నమోదవుతున్నాయన్నారు. ఆర్థిక పరిస్థితి అంతంత మాత్రమే ఉన్న నిరుపేదలకు, మధ్యతరగతి ప్రజలు ఆర్‌ఎంపీలను, ప్రభుత్వ ఆసుపత్రులను ఆశ్రయిస్తున్నారని, కొందరు రాలేక ఇళ్ల వద్దే ఉండిపోతున్నారన్నారు. వైద్యాధికారులు సిబ్బందిని అప్రమత్తం చేసి డోర్ టు డోర్ క్యాంపెయిన్ నిర్వహించి జ్వర పీడితులను గుర్తించి వారికి వైద్య సేవలు అందించాలన్నారు. అదే సమయంలో పరిసరాలను పరిశుభ్రంగా ఉంచేలా చూడాలని తెలిపారు. జెడ్పీటీసీ అర్జా వెంకట నగేష్ మాట్లాడుతూ మండలంలో తాగునీటి సమస్య తీవ్రంగా ఉందని, మచిలీపట్నం ఎంపీ బాలశౌరి ప్రత్యేకంగా చొరవ తీసుకొని ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు ప్రణాళికలు రూపొందించి అందజేయాలని సూచించారన్నారు. చోడవరం వద్ద రెండు టీఎంసీల నీరు నిల్వ ఉండేలా చెక్‌డాం నిర్మించి గ్రావిటీ ద్వారా స్వచ్ఛమైన తాగునీరు అందించడానికి ప్రణాళికలు అందజేయాలని ఎంపీ కోరారన్నారు. నందిగామ తాగునీటి చెరువుకు 24 గంటలు విద్యుత్ సరఫరా ఇవ్వకపోవడంపై జెడ్పీటీసీ విద్యుత్ శాఖాధికారులను ప్రశ్నించారు. నందిగామ గ్రామ పరిసరాలలో చేపల చెరువులకు 24 గంటలు విద్యుత్‌ను సరఫరా చేస్తున్నారని, తాగునీటి చెరువుకు మాత్రం 24 గంటలు విద్యుత్‌ను సరఫరా చేయలేకపోతున్నారని మండిపడ్డారు. విద్యుత్‌శాఖాధికారులు స్పందిస్తూ తాము నిబంధనల మేరకే నడుచుకుంటున్నామన్నారు. కొంకేపూడి సర్పంచ్ దావు బైరవలింగం మాట్లాడుతూ మహిళా మార్ట్ వద్దని చెప్పినా వినిపించుకోకుండా వెలుగు అధికారులు మహిళలతో మహిళా మార్ట్‌ను ఏర్పాటు చేయించారని, ఇప్పుడు అన్న క్యాంటీన్ ఏర్పాటుతో మహిళలు తీవ్రంగా నష్టపోయారన్నారు. నదులకు వరదలు వస్తున్నా కాలువలకు నీరు రాకపోవడం, సమావేశాలకు ఏఈలు రాకుండా లస్కర్‌లను పంపించడం ఏమిటంటూ ఇరిగేషన్ అధికారులపై సభ్యులు తీవ్ర స్థాయిలో మండిపడ్డారు. నందిగామ, కొంకేపూడి, నందమూరు తదితర గ్రామాలకు సాగునీరందని దుస్థితి ఏర్పడిందని, తక్షణం ఏఈలు ఎప్పుడు వస్తారో తెలియజేసి నీరు వచ్చేలా చూడలాన్నారు. నందిగామ తాగునీటి చెరువులో కూడా నీరు నిండుకుంటోందని, తక్షణం కాలువ ద్వారా నీరందించాలని ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ స్రవంతి ఇరిగేషన్ అధికారులను కోరారు. అనంతరం విద్యుత్, గృహ నిర్మాణం, విద్య తదితర శాఖలపై సమీక్షించారు. సమావేశంలో మండల పరిషత్ ప్రత్యేక ఆహ్వానితులు రాజులపాటి అచ్యుతరావు, ఉపాధ్యక్షుడు యాదంరెడ్డి వరప్రసాద్, ఎంపీడీవో వి.రెడ్డయ్య, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

సైబర్ నేరగాళ్ల వలలో చిక్కుకోవద్దు

చల్లపల్లి(అవనిగడ్డ): ఆశకుపోయి సైబర్ నేరగాళ్ల వలలో చిక్కుకోవద్దని చల్లపల్లి సీఐ కె.ఈశ్వరరావు ప్రజలకు సూచించారు. చల్లపల్లి పోలీస్‌స్టేషన్‌లో మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ కొత్త నంబర్ల నుంచి వచ్చే లింకులను ఓపెన్ చేయొద్దని సూచించారు. ఎక్కువ మొత్తంలో డబ్బులు ఇస్తామని ఆశ చూపించే ఏ విధమైన ప్రకటనలు నిజం కాదన్నారు. ఏ బ్యాంకు వారు తమ ఖాతాదారులకు ఫోన్ చేసి వివరాలు చెప్పమని అడగరని, ఎవరన్నా అలా వివరాలు అడిగితే చెప్పవద్దన్నారు. ఇతర దేశాల నుంచి వచ్చే ఫోన్ కాల్స్ లిఫ్ట్ చేయొద్దని, ఆధార్ అప్‌డేట్ అనో మరొకటి అప్‌డేట్ అని ఫోన్‌చేస్తే ఎవరూ రెస్పాండ్ కావద్దన్నారు. చల్లపల్లిలో ఇటీవల బ్లాక్ ట్రేడింగ్ యాప్ ద్వారా ఒకరు రూ.27 లక్షలు పోగొట్టుకున్నారని చెప్పారు. లోన్ యాప్‌ల ద్వారా ఎవరూ లోన్లు తీసుకోవద్దని సూచించారు. ఎవరన్నా సైబర్ నేరాలకు పాల్పడితే 1930 నంబర్‌కు ఫోన్‌చేసి సమాచారం అందించాలని చెప్పారు. వ్యాపారస్తులు తమ షాపుల వద్ద సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలన్నారు. సమావేశంలో ఎస్‌ఐ పి.సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.

అన్నపూర్ణాదేవి సన్నిధిలో ఘనంగా మంగళగౌరీ వ్రతం

శ్రీకాశీవిశ్వేశ్వరుని ఆలయంలో వంద మందితో సామూహిక పూజ



శ్రీఅన్నపూర్ణాదేవి ఆలయ ప్రాంగణంలో సామూహిక వ్రతం ఆచరిస్తున్న మహిళలు

భావదేవరపల్లి(నాగాయలంక): గ్రామంలోని శ్రీఅన్నపూర్ణాదేవి సమేత శ్రీకాశీవిశ్వేశ్వరస్వామి ఆలయంలో శ్రావణ మాసం పర్వదినాలను పురస్కరించుకుని మంగళవారం అమ్మవారికి సామూహిక మంగళగౌరీ వ్రతం, కుంకుమార్చన నిర్వహించారు. ఆలయ అర్చకుడు క్రోవి బాల సత్యనాగశర్మ, భట్టిప్రోలు కార్తికేయశర్మ నేతృత్వంలో సంప్రదాయ మంగళగౌరీ వ్రత పూజ జరిపారు. వందమంది మహిళా భక్తులు సామూహిక వ్రతంలో పీటలపై కూర్చున్నారు. తొలుత ఆలయంలో అమ్మవారికి అభిషేకాలు, అనంతరం శాస్త్రోక్తంగా కుంకుమార్చన జరిపారు. ఈ సందర్భంగా వ్రతం ఆచరించిన ప్రతి మహిళకు ఆలయ వ్యవస్థాపక ధర్మకర్త పూషడపు నిరంజనరావు, శివ సత్యవతి దంపతుల ఆర్థిక సౌజన్యంతో అమ్మవారి బంగారు పూత వెండి రూపులను బహూకరించారు. పలువురు భక్తులు అమ్మవారిని దర్శించుకుని మంత్రపుష్ప నీరాజనాలలో పాల్గొని తీర్థప్రసాదాలు స్వీకరించారు.

4 నుంచి రెవెన్యూ సదస్సులు ప్రారంభం

మోపిదేవి: ప్రభుత్వ భూములు, 22ఏ భూములు, భూ సర్వే నంబర్ పరిశీలన వంటి అంశాలపై పరిష్కారానికి మండలంలోని అన్ని గ్రామ పంచాయతీల వద్ద సెప్టెంబర్ 4 నుంచి గ్రామ సదస్సులు నిర్వహించనున్నట్లు తహసీల్దార్ శ్రీవిద్య మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ అవకాశాన్ని రైతులు, ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచిస్తూ, గ్రామ సభల షెడ్యూళ్లను విడుదల చేశారు. సెప్టెంబర్ 4వ తేదీ బుధవారం బొబ్బర్లంక గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద ఉదయం 9 నుంచి 1 గంట వరకు గ్రామసభ ఉంటుందని తెలిపారు. 5వ తేదీ ఉదయం 9 నుంచి 1 గంట వరకు, కొక్కిలిగడ్డ పంచాయతీ కార్యాలయం వద్ద, 10వ తేదీ ఉదయం 9 నుంచి 1 గంట వరకు కె.కొత్తపాలెం పంచాయతీ కార్యాలయం వద్ద, 11వ తేదీ ఉదయం 9 నుంచి సాయంత్రం 5 గంటల వరకు పెదప్రోలు పంచాయతీ కార్యాలయం వద్ద, 13వ తేదీ ఉదయం 9 నుంచి 1 గంట వరకు మోపిదేవి లంక పంచాయతీ కార్యాలయం వద్ద, 18వ తేదీ ఉదయం 9 నుంచి 1 గంట వరకు నాగాయితిప్ప పంచాయతీ కార్యాలయం వద్ద, 20వ తేదీ ఉదయం 9 నుంచి సాయంత్రం 5 గంటల వరకు వెంకటాపురం పంచాయతీ కార్యాలయం వద్ద, 21వ తేదీ ఉదయం 9 నుంచి సాయంత్రం 5 గంటల వరకు మోపిదేవి పంచాయతీ కార్యాలయం వద్ద, 24వ తేదీ ఉదయం 9 నుంచి 1గంట వరకు కోసూరువారిపాలెం పంచాయతీ కార్యాలయం వద్ద, 26వ తేదీ ఉదయం 9 నుంచి 1 గంట వరకు మేళ్లమర్తిలంక పంచాయతీ కార్యాలయం వద్ద, 28వ తేదీ ఉదయం 9 నుంచి 1 గంట వరకు ఉత్తరచిరువోలులంక పంచాయతీ కార్యాలయం వద్ద, అక్టోబర్ 1వ తేదీ ఉదయం 9 నుంచి సాయంత్రం 5 గంటల వరకు మెరకనపల్లి పంచాయతీ కార్యాలయం వద్ద, 4వ తేదీ ఉదయం 9 నుంచి సాయంత్రం 5 గంటల వరకు పెదకళ్లేపల్లి పంచాయతీ కార్యాలయం వద్ద రెవెన్యూ సదస్సులు నిర్వహించనున్నట్లు వివరించారు.

ప్రణాళికాబద్ధంగా పని చేయాలి

ఘంటసాల: వికసిత్ ఆంధ్రప్రదేశ్ కోసం అధికారులు ప్రణాళికాబద్ధంగా పనిచేయాలని ఇన్‌చార్జి ఎంపీడీవో కేజీ శ్రీనివాస చంద్ అన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం వికసిత్ ఆంధ్రప్రదేశ్ – 2047కు సంబంధించి మండల స్థాయి వర్క్‌షాపు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాబోయే ఐదేళ్లలో ప్రజా ప్రయోజనకరమైన శాఖల్లో 15 శాతం వృద్ధి సాధించేందుకు ప్రణాళికలు సిద్ధం చేయాలన్నారు.

ముక్కొల్లు పంచాయతీలో ఉద్రిక్తత



రికార్డులు పరిశీలిస్తున్న పంచాయతీ అధికారులు

గూడూరు: ముక్కొల్లు పంచాయతీలో మంగళవారం ఉద్రిక్త వాతావరణం నెలకొంది. దీనికి సంబంధించిన వివరాలు ఈ విధంగా ఉన్నాయి. ఆగస్టు 2న జరిగిన బదిలీలలో భాగంగా ముక్కొల్లు పంచాయతీ కార్యదర్శిగా ప్రభుత్వం సి.హెచ్.బాపూజీని నియమించింది. అంతకు ముందు ఇక్కడ పంచాయతీ ఇన్‌చార్జి కార్యదర్శిగా లోయ శివనాగేశ్వరరావు బాధ్యతలు నిర్వర్తిస్తూ వచ్చారు. కొత్త కార్యదర్శి నియామకం నేపథ్యంలో గత ఆదివారం లోయ శివనాగేశ్వరరావు పంచాయతీకి వచ్చి కొన్ని రికార్డులు తన వెంట తీసుకెళ్లడానికి ప్రయత్నించారు. దీనిని గమనించిన కొంతమంది గ్రామస్తులు అతనిని అడ్డుకుని డీపీఓ దృష్టికి తీసుకెళ్లారు. పంచాయతీలో కార్యదర్శి పలు అక్రమాలకు పాల్పడ్డారని, రికార్డులు తారుమారు చేయడానికే ఆదివారం పంచాయతీకి వచ్చి రికార్డులు తన వెంట తీసుకెళ్లడానికి ప్రయత్నిస్తున్నారంటూ గ్రామస్తులు డీపీఓకు ఫోన్ ద్వారా పిర్యాదు చేశారు. డీపీఓ ఆదేశాల మేరకు హుటాహుటిన పంచాయతీ కార్యాలయానికి వచ్చిన గూడూరు ఈఓపీఆర్డీ పి.రాజేశ్వరి రికార్డులు స్వాధీనం చేసుకుని, మంగళవారం పూర్తిగా విచారణ నిర్వహిస్తామని హామీ ఇచ్చి వెళ్లారు. ఆ మేరకు మంగళవారం పంచాయతీ కార్యాలయానికి చేరుకున్న ఈఓపీఆర్డీ పి.రాజేశ్వరి లోయ శివనాగేశ్వరరావు నుంచి తీసుకున్న రికార్డులు కొత్తగా నియమితులైన సి.హెచ్.బాపూజీకి అప్పగించారు. రికార్డుల గోల్‌మాల్ జరిగిందని, దానిపై విచారణ చేపట్టి చర్యలు తీసుకోవాలంటూ కూటమి నాయకులు ఆరోపణలకు దిగటంతో పంచాయతీ కార్యాలయం దగ్గర పరిస్థితి ఉద్రిక్తంగా మారింది. సర్పంచ్ జయవర్ధన్ వర్గీయులు ఒక వైపు, కూటమి నాయకులు ఒకవైపు మోహరించడంతో పరిస్థితిని అదుపు చేయడానికి పోలీసులు రంగ ప్రవేశం చేశారు. పెడన సీఐ నాగేంద్ర ప్రసాద్, చిలకలపూడి సీఐ అబ్దుల్ నబీ, గూడూరు, బంటుమిల్లి ఎస్‌ఐలు సత్యనారాయణ, గణేష్ కుమార్ పోలీసు బెటాలియన్‌తో గ్రామానికి చేరుకుని పరిస్థితిని అదుపు చేశారు. సమాచారం తెలుసుకున్న డీఎల్‌పీఓ ఐ.జ్యోతిర్మయి కూడా గ్రామానికి చేరుకుని పరిస్థితిని సమీక్షించారు. ఆదివారం కార్యాలయం తెరచి రికార్డులు తన వెంట తీసుకెళ్లడానికి ప్రయత్నించడంపై కార్యదర్శిని ప్రశ్నించారు. అయితే తాను ముక్కొల్లుతో పాటుగా ఆరు పంచాయతీలకు ఇన్‌చార్జిని, దానిలో భాగంగా గంద్రం పంచాయతీ రికార్డులు కూడా ఇక్కడే ఉన్నాయని, పనిఒత్తిడి ఎక్కువగా ఉండటంతో ఆదివారమైనప్పటికీ వాటిని తీసుకెళ్దామని వచ్చానని వివరణ ఇచ్చారు. డీఎల్‌పీఓ మాట్లాడుతూ రికార్డులలో ఏమైనా అవకతవకలకు పాల్పడినా, మాయం చేసినా దానికి పంచాయతీ కార్యదర్శి పూర్తి బాధ్యత వహించాల్సి ఉంటుందని స్పష్టం చేశారు. దీంతో గ్రామస్తులు శాంతించారు. అందరి సమక్షంలో కొత్తగా నియమితులైన కార్యదర్శి బాపూజీకి బాధ్యతలు అప్పగించి వెళ్లారు.

రైల్వేస్టేషన్‌లో సామూహిక పరిశుభ్రతలో విద్యార్థులు



రైల్వే స్టేషన్‌లో చెత్తను ఏరుతున్న విద్యార్థులు

మచిలీపట్నంటౌన్: భారత ప్రభుత్వ మినిస్ట్రీ ఆఫ్ యూత్ అఫైర్స్ ఆదేశాలతో స్థానిక కృష్ణా విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలో స్వచ్ఛత యాక్షన్ ప్లాన్ పురస్కరించుకుని ఎన్‌ఎస్‌ఎస్ విద్యార్థులు మంగళవారం స్థానిక రైల్వే స్టేషన్‌లో సామూహిక పరిశుభ్రత కార్యక్రమాన్ని నిర్వహించారు. స్థానిక లేడీ యాంప్తిల్ ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాల, నోబుల్ కళాశాలల ఎన్‌ఎస్‌ఎస్ వలంటీర్లు రైల్వే స్టేషన్‌లో పేరుకుపోయిన చెత్తా చెదారాలను తొలగించారు. ఎన్‌ఎస్‌ఎస్ రీజినల్ డైరెక్టర్ ఎస్.సంజయ్ కుమార్, కృష్ణా విశ్వ విద్యాలయం కోఆర్డినేటర్ డాక్టర్ ఎం.శ్రావణి ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో పాల్గొన్న మున్సిపల్ మాజీ చైర్మన్ మోటమర్రి బాబా ప్రసాద్ మాట్లాడుతూ ఎన్‌ఎస్‌ఎస్ వలంటీర్‌లు చేస్తున్న ఈ స్వచ్ఛత కార్యక్రమం అందరికీ ఆదర్శం కావాలన్నారు. స్వచ్ఛ మచిలీపట్నం కోసం మనమందరం కృషి చెయ్యాలన్నారు. 19 వ డివిజన్ కార్పొరేటర్ దేవరపల్లి అనిత మాట్లాడుతూ ఈ కార్యక్రమం తమ డివిజన్‌లో జరగటం డివిజన్ ప్రజలందరికీ స్ఫూర్తిదాయకమన్నారు. కార్యక్రమంలో నోబుల్ కళాశాల ప్రిన్సిపాల్ ఎర్నెస్ట్, లేడీ యాంప్తిల్ ఎన్‌ఎస్‌ఎస్ ప్రోగ్రాం అధికారి లంకిశెట్టి హరనాథ్ బాబు, అధ్యాపకులు మున్వర్, సురేష్, మహేష్, శ్రీకాంత్ ప్రోగ్రాం అధికారులు పాల్గొన్నారు.

పీఎఫ్, ఈఎస్‌ఐ అవకతవకలపై నేడు విచారణ

శానిటేషన్ కాంట్రాక్టర్ హాజరు కావాలని ఆదేశాలు



జీజీహెచ్ సూపరింటెండెంట్ సుందరాచారితో చర్చిస్తున్న కార్మిక సంఘ నాయకుడు జయకర్‌బాబు

మచిలీపట్నంటౌన్: మచిలీపట్నం ప్రభుత్వ సర్వజన ఆస్పత్రి, ప్రభుత్వ వైద్య కళాశాలలో పనిచేస్తున్న పారిశుద్ధ్య కార్మికుల పీఎఫ్, ఈఎస్‌ఐ అవకతవకలపై విచారించేందుకు అధికారులు సన్నద్ధమయ్యారు. మూడేళ్లుగా ఆసుపత్రిలో పనిచేస్తున్న పారిశుద్ధ్య కార్మికులు, ఏడాదిగా మెడికల్ కాలేజీలో పనిచేస్తున్న పారిశుద్ధ్య కార్మికుల జీతాల నుంచి మినహాయిస్తున్న పీఎఫ్, ఈఎస్‌ఐ సొమ్ములు కార్మికుల ఖాతాల్లో జమ కాకపోవడాన్ని నిరసిస్తూ అఖిల భారతీయ సఫాయి మజ్దూర్ కాంగ్రెస్ ఇటీవల నిరవధిక సమ్మెకు నోటీసులు ఇచ్చింది. ఈ నోటీస్ ప్రకారం సెప్టెంబర్ 4వ తేదీ నుంచి జీజీహెచ్, ప్రభుత్వ మెడికల్ కాలేజ్‌లలో పనిచేస్తున్న కార్మికులు నిరవధిక సమ్మెకు సన్నద్ధమయ్యారు. ఈ నేపథ్యంలో మంగళవారం అఖిల భారతీయ సఫాయి మజ్దూర్ కాంగ్రెస్ ట్రేడ్ యూనియన్ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర వైస్ ప్రెసిడెంట్ కుంపటి జయకర్ బాబు, యూనియన్ నాయకులు, సభ్యులు జీజీహెచ్ మెడికల్ సూపరింటెండెంట్, మెడికల్ కాలేజ్ ప్రిన్సిపాల్ డాక్టర్ సుందరాచారిని కలిసి వారికి జరుగుతున్న అన్యాయాన్ని వివరించారు. దీనిపై సుందరాచారితో పాటు జీజీహెచ్ డిప్యూటీ సూపరింటెండెంట్ డాక్టర్ శ్రీనివాసరావు, ఆర్‌ఎంఓ డాక్టర్ నిరంజన్‌కుమార్, కార్యాలయ సీనియర్ అసిస్టెంట్ ఉష, ఇటీవల ఉద్యోగ విరమణ చేసిన మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ రమేష్ లతో ప్రత్యేకంగా చర్చించారు. ఈ సందర్భంగా రోజురోజుకి ముదురుతున్న పీఎఫ్, ఈఎస్‌ఐ అవకతవకలపై సంబంధిత కాంట్రాక్ట్ ఏజెన్సీతో ప్రత్యక్ష విచారణ నిర్వహించాలని నిర్ణయించారు. ఈ నెల 28వ తేదీ బుధవారం ఉదయం 11 గంటలకు శానిటేషన్ కాంట్రాక్టు సంస్థ అయిన ఫస్ట్ ఆబ్జెక్ట్ ఏజెన్సీ ప్రైవేట్ లిమిటెడ్ కాంట్రాక్ట్ ఏజెన్సీ ప్రతినిధులు జీజీహెచ్‌లో జరిగే విచారణకు హాజరు కావాలని అధికారులు ఆదేశించారు.

100 మద్యం సీసాలు స్వాధీనం



నీలిపూడిలో దొరికిన మద్యం సీసాలతో కృత్తివెన్ను ఎస్‌ఐ పైడిబాబు

కృత్తివెన్ను: మండల పరిధిలోని నీలిపూడి గ్రామంలో మంగళవారం పోలీసులు జరిపిన దాడిలో ఒక వ్యక్తి వద్ద నుంచి 100 మద్యం సీసాలు స్వాధీనం చేసుకున్నట్లు ఎస్‌ఐ పైడిబాబు తెలిపారు. ఎక్సైజ్ రైడ్‌లో భాగంగా జరిపిన సోదాలలో గ్రామానికి చెందిన సానా వీరరాఘవయ్య అనే వ్యక్తి బెల్టు షాపు నడుపుతుండగా దాడి చేయగా 100 క్వార్టర్ బాటిళ్లు దొరికాయని, సదరు వ్యక్తిని అరెస్ట్ చేసి కేసు నమోదు చేయడంతో పాటు మద్యం సీసాలను సీజ్ చేసినట్లు పేర్కొన్నారు.

20 మద్యం సీసాలు స్వాధీనం

బంటుమిల్లి: బంటుమిల్లి శివార్లలో పోలీసులు తనిఖీలు చేస్తుండగా నిబంధనలకు విరుద్ధంగా మద్యం సీసాలు కలిగి ఉన్న యువకుడిని అరెస్ట్ చేశారు. పోలీసువారి సమాచారం మేరకు కృత్తివెన్ను మండలం చినపాండ్రాక పంచాయతీ శివారు రామాపురం గ్రామానికి చెందిన బొమ్మిడి సామోరు వద్ద అక్రమంగా 20 మద్యం సీసాలు ఉండటంతో వాటిని స్వాధీనం చేసుకుని నిందితునిపై ఎస్‌ఐ గణేష్‌కుమార్ కేసు నమోదు చేశారు.

వసతి గృహానికి వాటర్ ప్యూరిఫైర్ అందజేత

మచిలీపట్నంటౌన్: స్థానిక హైనీ బాలుర వసతి గృహానికి మైత్రి ఫౌండేషన్ ఆధ్వర్యంలో మంగళవారం స్థానిక ఈడేపల్లికి చెందిన పోలుగాని అశోక్ జన్మదిన సందర్భంగా ఆయన కుటుంబ సభ్యులు రూ.20 వేల విలువైన వాటర్ ప్యూరిఫైర్‌ను అందజేశారు. నగరంలోని పలు వసతి గృహాల్లో నివసించే బాలబాలికల సౌకర్యార్థం గత రెండేళ్లుగా మౌలిక సదుపాయాలు ఏర్పాటు చేస్తున్నామని ఫౌండేషన్ అధ్యక్షుడు వేణు కుమార్ తెలిపారు.

పాడి రైతులకు బోనస్ పంపిణీ

బంటుమిల్లి: మండల పరిధిలోని మల్లేశ్వరం పాల ఉత్పత్తిదారుల పరస్పర సహాయక సహకార సంఘ రైతులకు జిల్లా యూనియన్ చైర్మన్ చలసాని ఆంజనేయులు మంగళవారం బోనస్ పంపిణీ చేశారు. స్థానిక పాల కేంద్రం వద్ద అధ్యక్షురాలు పేపేటి వీరమ్మ అధ్యక్షతన ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన 239 మంది రైతులకు 2023–24 సంవత్సరంలో మంజూరైన బోనస్ రూ.66,750లకు చెక్‌లను జిల్లా డైరెక్టరు అర్జా నగేష్‌బాబు, మేనేజరు తోట సత్యన్నారాయణ, అధ్యక్షురాలు వీరమ్మతో కలసి పంపిణీ చేశారు. తొలుత సంఘంలో సుమారు రూ.87వేలతో కొత్తగా ఏర్పాటు చేసిన నానో మిషన్‌ను చైర్మన్ ఆంజనేయులు ప్రారంభించారు. కార్యక్రమంలో ఎంపీటీసీ పేపేటి వీరబాబు, సూపర్‌వైజరు సీహెచ్ వరప్రసాదు, రైతులు పాల్గొన్నారు.

శివరామకృష్ణ క్షేత్రానికి రూ.1.01 లక్షల విరాళం



కోడూరు: కోడూరులో నూతనంగా నిర్మిస్తున్న శివరామకృష్ణ క్షేత్రానికి ఇస్మాయిల్‌బేగ్‌పేట గ్రామానికి చెందిన కోట రంగరాజు పెరుమాళ్లు– వేదవతి, చక్ర పవన్‌కుమార్ – ధరణి దంపతులు రూ.1,01,116 నగదును విరాళంగా అందించారు. ఈ నగదును మంగళవారం కమిటీ సభ్యులకు అందించారు.

పాముకాటుకు గురై వ్యక్తి మృతి



చినకళ్లేపల్లి(ఘంటసాల): చినకళ్లేపల్లి ఎస్సీ కాలనీకి చెందిన వ్యక్తి పాము కాటుతోమృతిచెందాడు. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల మేరకు ఘంటసాల మండలం చినకళ్లేపల్లి గ్రామానికి చెందిన గురిందపల్లి మహాలక్ష్మణుడు (58) పాముకాటుకు గురై చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందినట్లు చెప్పారు. మహాలక్ష్మణుడు ఈ నెల 24న బాపట్ల జిల్లా నిజాంపట్నం మండలం అచ్యుతాపురం వ్యవసాయ పనులకు వెళ్లగా నారుమడి లాగుతుండగా మచ్చల పింజేరు పాముకాటుకు గురయ్యాడు. నగరం,అవనిగడ్డ,మచిలీపట్నం ప్రభుత్వ ఆసుపత్రుల్లో చికిత్స చేసిన అనంతరం విజయవాడ ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మహాలక్ష్మణుడు సోమవారం మరణించాడు.

ఎంపీ కంగనారనౌత్ రైతులకు క్షమాపణ చెప్పాలి

బంటుమిల్లి: రైతు సంఘాలు చేసిన పోరాటాలపై అనుచిత వ్యాఖ్యలు చేసిన ఎంపీ కంగనారనౌత్ రైతులకు బహిరంగ క్షమాపణ చెప్పాలని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘ నాయకులు డిమాండ్ చేశారు. ఆమె వ్యాఖ్యలకు నిరసనగా మంగళవారం స్థానిక అంబేడ్కర్ సెంటర్లో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా రైతు సంఘం జిల్లా కార్యదర్శి గౌరిశెట్టి నాగేశ్వరరావు మాట్లాడుతూ కిసాన్ మోర్చా ఆధ్వర్యంలో రైతులు చేసిన ఆందోళన కార్యక్రమాలపై అవగాహన లేక ఆమె దిగజారుడు వ్యాఖ్యలు చేసిందని ఖండించారు. బాధ్యత గల ఎంపీగా రైతులకు బేషరతుగా క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు.

క్లుప్తంగా

4న కార్తికేయుని హుండీ కానుకల లెక్కింపు

మోపిదేవి: స్థానిక శ్రీవల్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వరస్వామివారి దేవస్థానం భక్తులు సమర్పించిన హుండీ కానుకల లెక్కింపు సెప్టెంబర్ 4 బుధవారం స్వామివారి ఆలయ ప్రాంగణంలో నిర్వహించనున్నట్లు ఆలయ ఏసీ ఎన్ఎస్ చక్రధరరావు తెలిపారు. ఎండోమెంట్ ఇన్‌స్పెక్టర్ సమక్షంలో ఉదయం 8 గంటలకు హుండీ లెక్కించనున్నట్లు చెప్పారు. ఆసక్తి గల భక్తులు డ్రెస్‌కోడ్‌లో పాల్గొనవచ్చునని ఏసీ చక్రధరరావు తెలిపారు.

మెగా పవర్ ఫీస్ట్ వేడుకలకు ఎమ్మెల్యే మండలికి ఆహ్వానం

అవనిగడ్డ: అఖిల భారత చిరంజీవి యువత వ్యవస్థాపక అధ్యక్షుడు రవణం స్వామినాయుడు ఆధ్వర్యంలో సెప్టెంబర్ ఒకటో తేదీన విజయవాడలో జరిగే మెగా పవర్ ఫీస్ట్ వేడుకలకు స్థానిక ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్‌ను ఆహ్వానించారు. చిరంజీవికి పద్మవిభూషణ్ అభినందన సభ, ఉప ముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్ జన్మదిన వేడుకలను విజయవాడలో నిర్వహిస్తున్నట్లు అఖిల భారత చిరంజీవి యువత ఉపాధ్యక్షుడు సోడిశెట్టి కృష్ణప్రసాద్ చెప్పారు. ఈ మేరకు ఆయన ఎమ్మెల్యే బుద్ధప్రసాద్ స్వగృహంలో ఆయన్ను కలుసుకుని ఆహ్వానాన్ని అందించారు.

వైభవంగా శాంతికల్యాణం

బంటుమిల్లి: మండల పరిధిలోని పెదతుమ్మిడి గ్రామంలో కొలువై ఉన్న శ్రీ రుక్మిణి, సత్య సమేత కృష్ణ ఆలయంలో స్వామి వారి వార్షిక శాంతికల్యాణం మంగళవారం వైభవంగా నిర్వహించారు. శ్రీకృష్ణజన్మాష్టమి ఉత్సవాల్లో భాగంగా పలువురు దంపతులు దీక్ష ధారణలతో ఉదయం స్వామివారి ప్రధానమూర్తులకు అభిషేకాలు, పూజలు, హోమాలు అనంతరం శాంతికల్యాణం ఘనంగా నిర్వహించారు. అనంతరం ఏర్పాటు చేసిన అన్నసమారాధనలో పెదతుమ్మిడి పరిసర గ్రామాల భక్తులు పాల్గొన్నారు.

క్రీడా పోటీల్లో లింగారెడ్డిపాలెం విద్యార్థుల ప్రతిభ



కోడూరు: జాతీయ క్రీడా దినోత్సవాన్ని పురస్కరించుకుని అవనిగడ్డ సబ్‌జోన్ పరిధిలో నిర్వహించిన ఆటల పోటీల్లో లింగారెడ్డిపాలెం జెడ్పీ పాఠశాల విద్యార్థులు ప్రతిభ కనబర్చారు. అథ్లెటిక్స్ విభాగంలో బాలికలు సత్తా చాటారు. తొమ్మిదవ తరగతికి చెందిన పి.మధుప్రియ షార్ట్‌పుట్‌లో ప్రథమ స్థానం, డిస్క్ త్రో, లాంగ్‌జంప్, 100 మీటర్ల పరుగు పందెంలో ద్వితీయస్థానం కైవసం చేసుకుంది. అదే తరగతికి చెందిన బి.దివ్య 400 మీటర్ల పరుగు పందెంలో ప్రథమ స్థానం, పి.లావణ్య మూడవ స్థానంలో నిలిచారు. ప్రతిభ కనబర్చిన విద్యార్థినులను, వారికి శిక్షణ ఇచ్చిన పీఈటీ బీపీఎల్ ప్రసాద్‌ను ఉపాధ్యాయులు, గ్రామ ప్రముఖులు అభినందించారు.

శ్రీకాకుళేశ్వర స్వామి వారిని దర్శించుకున్న ఎంపీ బాలశౌరి



శ్రీకాకుళం(ఘంటసాల): మండలంలోని శ్రీకాకుళం గ్రామంలో ఉన్న ఆంధ్ర మహావిష్ణువు శ్రీకాకుళేశ్వర స్వామి వారిని మచిలీపట్నం ఎంపీ వల్లభనేని బాలశౌరి మంగళవారం దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆలయ సహాయక కార్యదర్శి చక్రధరరావు ఆధ్వర్యంలో అర్చకులు ఘన స్వాగతం పలికారు. స్వామి వారిని దర్శించుకున్న ఎంపీ బాలశౌరి స్వామి వారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. అనంతరం ఎంపీ బాలశౌరిని దుశ్శాలువా, పూలమాలతో సత్కరించి తీర్థప్రసాదాలు అందించారు. ఆలయ ప్రాంగణంలోని ఆముక్త మాల్యద మండపంలో శ్రీకృష్ణదేవరాయలు విగ్రహానికి ఎంపీ బాలశౌరి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. గ్రామానికి వచ్చిన ఎంపీ బాలశౌరిని జనసేన, టీడీపీ నేతలు దుశ్శాలువా, పూలమాలలతో ఘనంగా సన్మానించారు. శ్రీకాకుళం జెడ్పీ హైస్కూల్ ప్లస్ ప్రధానోపాధ్యాయురాలు అమ్మిరెడ్డి అనుపల్లవి, ఉపాధ్యాయులు, స్థానికులు హైస్కూల్లో ఉపాధ్యాయులను నియమించాలని కోరారు.

పెదప్రోలు విద్యార్థికి ఆర్థిక సాయం

పటమట(విజయవాడతూర్పు): ఆర్థిక ఇబ్బందులతో ప్రతిభ గల విద్యార్థులు చదువుకు దూరం కాకూడదనే లక్ష్యంతో హ్యాపీ ఫీట్ వెల్ఫేర్ ఆర్గనైజేషన్ చేస్తున్న సేవలు అభినందనీయమని మచిలీపట్నం ఎంపీ వల్లభనేని బాలశౌరి అన్నారు. మోపిదేవి మండలం పెదప్రోలు గ్రామానికి చెందిన మేకల శశికిరణ్ ఇంజినీరింగ్ రెండో సంవత్సరం చదువుతున్నాడు. కొంతకాలం క్రితం అతని తల్లిదండ్రులు చనిపోయారు. కళాశాల ఫీజు చెల్లించేందుకు ఆర్థికంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్నాడు. మచిలీపట్నానికి చెందిన తోట మనోహర్ ద్వారా విషయం తెలుసుకున్న హ్యాపీ ఫీట్ వెల్ఫేర్ ఆర్గనైజేషన్ సభ్యులు శశికిరణ్ ఫీజు చెల్లించేందుకు ముందుకొచ్చారు. కళాశాల ఫీజు రూ.45 వేలను మంగళవారం విజయవాడ భారతినగర్‌లోని ఎంపీ బాలశౌరి క్యాంపు కార్యాలయంలో ఆయన చేతుల మీదుగా అందజేశారు.